RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 323 పేజీలు - 04 వెల - 05/- శనివారం 3 ఆగష్టు 2024

# బొత్సను రంగంలోకి దించిన జగన్..

## విజయం దక్కుతుందా.?



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 02:

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చవిచూసింది. ఆ ఓటమి బాధ నుంచి ఇంకా తేరుకోక ముందే మరో ఎన్నిక వచ్చి పడింది. పోటీ చేయక తప్పని పరిస్థితి ఎదురైంది.దీంతో సర్వశక్తులు ఒడ్డాలని వైసిపి నిర్ణయించుకుంది.ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. ఎన్నికల కు ముందు వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ జనసేనలో చేరారు. దీంతో ఆయనపై వైసీపీ అనర్హత వేటు వేయించింది. దీంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. అది వైసీపీ స్థానం కావడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి స్పష్టమైన మెజారిటీ ఉండడంతో పోటీ చేయాలని వైసిపి నిర్ణయించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు అవుతున్న నేపథ్యంలో.. ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు నేతలు ముందుకు రాని పరిస్థితి. విశాఖ జిల్లాకు చెందిన తాజా మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు లో ఒకరిని బరిలో దించుతారని ప్రచారం జరిగింది. అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన గుడివాడ అమర్నాథ్కు మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కింది. కానీ ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ టికెట్ ఇవ్వలేదు. గాజువాక కేటాయించారు. కానీ ఆయనపై టిడిపి అభ్యర్థి పల్లా శ్రీనివాస్ ఏకపక్ష విజయం సొంతం చేసుకున్నారు.మరోవైపు మాడుగుల ఎమ్మెల్యేగా ఉన్న బూడి ముత్యాల నాయుడు ను క్యాబినెట్ లోకి తీసుకున్నారు జగన్. ఏకంగా డిప్యూటీ సీఎం హోదా కట్టబెట్టారు. మిగతా 2లో


# రైతులకు పగటిపూటే

## 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందాలి.!

**-విద్యుత్ ఫీడర్ల సామర్థ్యం పెంపుతో పాటు ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు చేయాలి.**

**-సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలి.**

**-విద్యుత్ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు**



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 02:

రాష్ట్ర రైతాంగానికి పగటిపూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఆయా ఫీడర్ల సామర్థ్యాన్ని మెరుగు పరచడంతో పాటు ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. డిమాండుకు తగ్గ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి వంటి పరిస్థితులను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో సీఎం విద్యుత్ శాఖపై శుక్రవారం సమీక్షించారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉందని, ఆ దిశగా ప్రణాళికలతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, యూనిట్ విద్యుత్ తయారీకి అవుతున్న వ్యయం, లోటును భర్తీ చేసేందుకు ఇతర గ్రిడ్ల నుండి కొనుగోలు చేస్తున్నవిద్యుత్ కు అవుతున్న వ్యయం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అదే విధంగా థర్మల్, జల విద్యుత్, సోలార్, విండ్ వంటి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు, త్వరలో అందుబాటులోకి రానున్న విద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితులపైనా సమీక్షించారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ విధానంపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అంతకు ముందు రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి పరిస్థితులను సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎం కార్యదర్శి ఏ.వీ రాజమౌళి, ఏపీ జెన్.కో ఎండీ చక్రధర్ బాబు, ఏపీ ట్రాన్స్ కో జెఎండీకీర్తి, ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, కెపిఎంజి ప్రతినిధి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు

# ఒక వర్గం నిరంతర పోరాటానికి దక్కిన ఫలితం.!

-ఎస్సీలలో ఐక్యత చెక్కు చెదరకుండా చూడాలి.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.



2లో

# 30 సంవత్సరాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

-మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ.

4లో



# రైతులకు తక్షణమే రాయితీపై బిందు సేద్యం అందించాలి.!

**-గత వైసీపీ ప్రభుత్వం రూ.1167 కోట్ల బకాయిలు పెట్టింది.**

**-బిందు సేద్యంలో దేశంలో ముందున్న రాష్ట్రాన్ని దేశంలోనే చివరి స్థానంలోకి జగన్ ప్రభుత్వం తీసుకెళ్లింది.**

**-ఈ ఏడాది 3 లక్షల హెక్టార్లలో బిందు సేద్యం అమలు.**

**-రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు.**



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 02:

రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు తక్షణమే బిందు సేద్యం పరికరాలు రాయితీపై అందించాలని, అందుకు గాను ఈరోజు నుంచే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో రాయితీపై బిందు సేద్యం అమలు పై అధికారులతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగతా 2లో



# రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాల వల్ల ఎలాంటి లాభం లేదు..!

**-రేషన్ పంపిణీ వాహనాలపై మంత్రి నాదెండ్ల మనోహర్ సంచలన వ్యాఖ్యలు.**

**-ఎండీయూలను త్వరలో రద్దు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం.**

**-వీధి చివర వాహనం పెట్టి మాత్రమే బియ్యం పంపిణీ చేశారు.**

**-పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

2లో

# చిన వంగలి సంఘటన చాలా బాధకరం

**: మృతులకు సంతాపం తెలిపిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్**

**: ప్రసన్న భాద్యత నాది మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్**



నంద్యాల ఆంధ్ర ప్రగతి ఆగష్టు 2 : మండలపరిధిలోని చినవంగలి గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుందని, ఈ విషాద సంఘటన అందరిని కలిసివేస్తోందని, ప్రసన్న బాధ్యత పూర్తిగా తాను తీసుకొని ఆ బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. చాగలమర్రి మండలం చినవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడడం చాలా బాధేస్తోందని అన్నారు. చినవంగలి గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి (45), దస్తగిరమ్మ (38) దంపతులు ఉండగా, వారి ఇద్దరు కుమార్తెలైన పవిత్ర (16), గురులక్ష్మి(10)లు ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. కుటుంబంలో మొత్తం ఐదుగురు సభ్యులు ఉండగా, రెండో కుమార్తె ప్రసన్న కడప జిల్లా ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో చదువుతున్నట్లు సమాచారం ఉందని ఈ తీవ్ర విషాద ఘటన నిన్న (గురువారం) అర్ధరాత్రి సమయంలో జరిగినట్లు తెలుస్తోందని, శుక్రవారం తెల్లవారుజామున ఈ విషయాన్ని గమనించిన స్థానికులు శిథిలాలను తొలగించి చూడగా అప్పటికే నలుగురు మృతిచెందడం, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం కలిసివేస్తోందని మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందించేందుకు కృషి చేస్తానని అలాగే ప్రసన్న ఉన్నత చదువుల పూర్తి సహకారం అందిస్తామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలియజేశారు.అలాగే ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పందిస్తూ బాధ్యత కుటుంబానికి అండగా ఉంటామని వారికి ఏ అవసరం వచ్చిన మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు.

# బొత్సను రంగంలోకి దించిన జగన్.. విజయం దక్కుతుందా.?

*(మొదటి పేజి తరువాయి)*

కానీ ఈసారిఆయనతో అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయించారు. భారీ ఓటమి తప్పలేదు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు ముంచుకు రావడంతో.. ఆ ఇద్దరు నేతల అభిప్రాయాలను తీసుకున్నారు జగన్. కానీ ఇద్దరూ విముఖత చూపినట్లు సమాచారం.

### వైసీపీకి ఏకపక్ష మెజారిటీ

ప్రస్తుతం విశాఖ జిల్లాలో స్థానిక సంస్థలకు సంబంధించి వైసీపీకి ఏకపక్ష మెజారిటీ ఉంది. మొత్తం 841 ఓట్లు ఉన్నాయి. ఓ 11 స్థానాల్లో మాత్రం ఖాళీలు ఉన్నాయి. వైసీపీకి 615 మంది సభ్యుల బలం ఉంది. టిడిపి కూటమి బలం కేవలం 215 ఓట్లు మాత్రమే. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్, అనకాపల్లి,ఎలమంచిలి, భీమిలి, నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, అన్ని మండలాల జడ్పిటిసిలు, ఎంపీటీసీలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.ఈ లెక్కన వైసిపి విజయం నల్లేరు మీద నడకే.కానీ స్థానిక సంస్థల ప్రతినిధులు ఎటు నిలబడతారన్నది తెలియడం లేదు.

### వలసలతో కూటమికి బలం

ఎన్నికలకు ముందు చాలామంది స్థానిక ప్రజాప్రతినిధులు కూటమి వైపు మొగ్గు చూపారు.కూటమికి అనుకూలంగా ప్రచారం చేశారు. అధికారికంగా చేరిన వారు ఉన్నారు. సానుభూతి వ్యక్తం చేసిన వారు ఉన్నారు. మరికొందరు అధికార పార్టీ ప్రతినిధులు సైలెంట్ కూడా అయ్యారు. ఈ తరుణంలో వారంతా వైసీపీ అభ్యర్థికి ఓటు వేస్తారా? లేదా? అన్నది అనుమానమే. గ్రేటర్ విశాఖలో 12 మంది కార్పొరేటర్లు ఇటీవల టిడిపి,జనసేనలో చేరారు. మరికొందరు చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.ఇప్పటికే భీమిలి,నర్సీపట్నం, అనకాపల్లి నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున స్థానిక సంస్థల ప్రతినిధులు కూటమిలోకి వచ్చారు. అందుకే స్థానిక వైసీపీ నేతలు పోటీ చేసేందుకు భయపడుతున్నారు.

### ఎట్టకేలకు అభ్యర్థి ఖరారు

అయితే బలం ఉన్నచోట అభ్యర్థిని పెట్టకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని జగన్ కు తెలుసు. అందుకే సీనియర్ నేత,మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ను జగన్ రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. విశాఖకు చెందిన కార్పొరేటర్లు, స్థానికసంస్థల ప్రతినిధులు ప్రత్యేక బస్సుల్లో తాడేపల్లికి వెళ్లారు.జగన్ వారితో కీలక చర్చలు జరిపారు. విశాఖ పార్టీ నేతలతో సమావేశమై.. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ పేరును ఖరారు చేశారు. వెంటనే గెలుపు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. మొత్తానికి అయితే జగన్ గట్టి వ్యూహమే రూపొందించారు. దానిని కూటమి ప్రభుత్వం ఎలా చేధిస్తుందో చూడాలి.

# రైతులకు తక్షణమే రాయితీపై బిందు సేద్యం అందించాలి.!

*(మొదటి పేజి తరువాయి)*

జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో బిందు సేద్యం నిర్వీర్యం అయ్యిందని, గడిచిన ఐదేళ్లలో రైతుల పట్ల వైసీపీ ప్రభుత్వం తీవ్ర కక్ష పూరిత ధోరణి అవలంభించిందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.1167 కోట్ల బకాయిలు పెట్టిందని రైతులకు తక్షణమే బిందు సేద్యం అమలు చేయాలనే సంకల్పంతో కంపెనీలకు బకాయిలు చెల్లిస్తున్నామని మంత్రి గారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బకాయిల్లో రూ.176 కోట్లు విడుదల చేశామని, వాయిదా పద్ధతిలో త్వరలోనే బకాయిలు కంపెనీలకు చెల్లిస్తామని వెల్లడించారు.

జగన్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా అందించే బిందు సేద్యం ఫండ్ (మైక్రో ఇరిగేషన్ ఫండ్) కూడా సద్వినియోగం చేసుకోలేదని అన్నారు.

ఈ ఏడాది 3 లక్షల హెక్టార్లలో సాగుకు రాయితీపై బిందు సేద్యం అమలు చేసేందుకు లక్ష్యం నిర్దేశించినట్లు మంత్రి తెలిపారు. తద్వారా రాష్ట్ర రైతాంగానికి ప్రత్యక్షంగా పరోక్షంగా 3450 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అన్నారు.

2004 లో అప్పటి ప్రధాని వాజ్పేయి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దేశ వ్యాప్తంగా బిందు సేద్యం అభివృద్ధి చేసేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో 2015 - 2018 మధ్య దేశంలోనే బిందు సేద్యం అమలులో ఆంధ్రప్రదేశ్ 17.6% భాగస్వామ్యంతో ప్రధమ స్థానంలో ఉంటే జగన్మోహన్ రెడ్డి 2019 - 2023 మధ్య 5.7 శాతం భాగస్వామ్యానికి తీసుకుని వచ్చి బిందు సేద్యాన్ని నిర్వీర్యం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఉద్యాన సాగులో 55% మాత్రమే బిందు సేద్యం అమలౌతోందని, నూరు శాతం ఉద్యాన సాగులో బిందు సేద్యం అమలు చేసేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్డీయే ప్రభుత్వం రైతులకు, రైతు శ్రేయస్సు కోసం బిందు సేద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో బిందు సేద్యం తక్షణమే అమలుకు ఆదేశాలు జారీ చేయాలని ఆదేశించారు.సమావేశంలో ఉద్యాన, మత్స్య శాఖల కార్యదర్శి అహ్మద్ బాబు, ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఏపీ ఎం ఐ డి పి ప్రాజెక్టు అధికారి బి.హరనాథరెడ్డి పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఒక వర్గం నిరంతర పోరాటానికి దక్కిన ఫలితం.!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 02:

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేయవచ్చని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఒక వర్గం సాగించిన నిరంతర పోరాటానికి దక్కిన ఫలితం. మన తెలుగు రాష్ట్రాల్లో మాదిగలు పోరాడుతూ ఉన్నారు. ఇందుకు సంబంధించి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు శ్రీ మంద కృష్ణ మాదిగ పోరాటం చేశారు. ఈ పోరాటాలకు సుప్రీం కోర్టు తీర్పు ద్వారా ఫలితం దక్కింది. పోరాడి విజయం సాధించిన మంద కృష్ణ మాదిగ కి అభినందనలు. మాదిగలకు రిజర్వేషన్ కల్పనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్డీయే-2 పాలన కాలంలో సానుకూలంగా స్పందించారు. వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న లక్ష్యం నెరవేరుతుందని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీం కోర్టుకు తెలియచేసింది. ఎస్సీ వర్గీకరణకు ఎన్డీయే-2 పాలనలో సానుకూలత రావడం స్వాగతించదగ్గ పరిణామం. ఇందుకుగానూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి కృతజ్ఞతలు. శ్రీ చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే వోట్ బ్యాంక్ రాజకీయాలకు భిన్నంగా, అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు వర్గీకరణ నిర్ణయం తీసుకున్నారు. దశాబ్దాల నుంచి ఉన్న అంశంపై సుప్రీం కోర్టు నుంచి తీర్పు వెలువడటం హర్షణీయం.

వర్గీకరణకు సానుకూలంగా వచ్చిన ఈ తీర్పు ఎస్సీల్లో ఐక్యత చెక్కు చెదరకుండా చూసుకోవలసిన బాధ్యత ఎస్సీ సామాజిక వర్గ మేధావులు, విద్యావంతులపై ఉంది. రిజర్వేషన్లలో కోటా కావాలని ఒక వర్గం దశాబ్దాల తరబడి డిమాండ్ చేస్తూ, పోరాడుతూ ఉందంటే ఆ వర్గంవారిలో ఉన్న అశాంతి, వారి ఆలోచనలను కూడా గుర్తించి పరిగణనలోకి తీసుకోవాలి. రాజకీయ, సామాజిక అధ్యయనాలతో వర్గీకరణ అంశాన్ని సున్నితంగా, సునిశితంగా చూడాలి. ఎస్సీల్లోని ఉప కులాలవారు కూడా ఎదగాలని, మాదిగలకు తగిన అవకాశాలు దక్కాలని ఆకాంక్షించే మాల సామాజికవేత్తలు, మేధావులు ఉన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలపై పలువురు విద్యావేత్తలు, దళిత సాహితీవేత్తలు, సామాజికవేత్తలు 2007 నుంచీ వేర్వేరు సందర్భాల్లో చర్చిస్తూనే ఉన్నారు. భిన్నాభిప్రాయాలు ఉన్నా ఎస్సీల్లో దిగువనే ఉండిపోతున్నవారు ఫలాలు పొందాలనే భావన వారి మాటల్లో స్పష్టమయ్యేది.

ఈ క్రమంలో వర్గీకరణ తీర్పు వెలువరించే సందర్భంలో జస్టిస్ బి. ఆర్. గవాయ్ ఎస్సీ, ఎస్టీల్లోనూ క్రీమీ లేయర్ ను గుర్తించే విధానం రూపొందించాలి అనే విషయాన్ని స్పష్టం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆకాంక్షించిన నిజమైన సమానత్వం సాధించేందుకు క్రీమీ లేయర్ విధానం అవసరమే. ఎస్సీ రిజర్వేషన్ ద్వారా అఖిల భారత సర్వీసుల్లో ఉన్నతోద్యోగాలు పొందిన వారు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినవారి బిడ్డలకీ రిజర్వేషన్ల ద్వారా అవకాశాలు దక్కితే వారి సామాజిక వర్గంలోనే దిగువ స్థాయిలో ఉన్నవారికి రిజర్వేషన్ ఫలాలు అందకుండాపోతాయి. ఈ విషయంపైన కూడా ఎస్సీ సామాజిక వర్గ మేధావులు చర్చించాల్సిన అవసరాన్ని నేటి తీర్పు తెలియచేస్తోంది.

# మృత్యువాత పడ్డ కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 02:

నంద్యాల జిల్లా చాగల్లమర్రి మండలం చినవంగలిలో మిద్దె కూలి నలుగురు ఒకే కుటుంబ సభ్యులు మరణించడం బాధాకరమని రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులలో పదవ తరగతి చదువుతున్న..ప్రసన్న.. అనే అమ్మాయిని ఉన్నత చదువులు చదువుకునేందుకు అన్ని వసతులు రాష్ట్ర ప్రభుత్వమే కల్పించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ చాగలమర్రి మండలం చినవంగలి గ్రామానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు మిద్దెలో పడుకుని ఉండగా గురుశేఖర్‌రెడ్డి (45), దస్తగిరమ్మ (38) దంపతులు ఉండగా, వారి ఇద్దరు కుమార్తెలైన పవిత్ర (16), గురులక్ష్మి(10)లు రాత్రి మిద్దెలో పండుకొని ఉండగా ఉన్న పొలంలో మిద్దెకూలడంతో ఆ నలుగురు కుటుంబ సభ్యులు మరణించడం చాలా బాధాకరమని ఆవేదన చెందారు.నంద్యాల జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు చిన్న వంగలి గ్రామంలో జరిగిన సంఘటన పరిశీలించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందించేందుకు కృషి చేస్తూ 10 వ తరగతి చదువుతున్న ప్రసన్న ఉన్నత చదువుల పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని పై నాయకులు తెలిపారు.

# రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాల వల్ల ఎలాంటి లాభం లేదు..!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 02:

సివిల్ సప్లైస్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షలో రేషన్ బియ్యం పంపిణీ వాహనాలు–ఎండీయూలపై కీలక చర్చ జరిగింది. ఎండీయూ వాహనాల వల్ల నష్టమే తప్ప లాభం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఎండీయూలను త్వరలో రద్దు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉందన్నారు. ఎండీయూ వాహనాలకు ఇంకా చెల్లింపులు జరపాల్సి ఉండడంతో సమస్యను ఎలా పరిష్కరించాలన్న దానిపై కసరత్తు చేయాలని సీఎం చెప్పుకొచ్చారు.. బియ్యం డోర్ డెలివరీ పేరుతో చేపట్టిన విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు.. రాష్ట్రంలో ఎక్కడా ఈ వాహనాల ద్వారా రేషన్ డోర్ డెలివరీ జరగలేదని మంత్రి అన్నారు. వీధి చివర వాహనం పెట్టి మాత్రమే బియ్యం పంపిణీ చేశారు.. రేషన్ డోర్ డెలివరీ పేరుతో రూ.1,844 కోట్లతో 9260 వాహనాలు గత ప్రభుత్వం కొనుగోలు చేసిందని అధికారులు వెల్లడించారు.

ఇక, రేషన్ బియ్యం తరలింపు వాహనాలను కూడా బియ్యం స్మగ్లింగ్ కు వాడుకున్నారన్న అంశంపై సమీక్ష సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావన తీసుకొచ్చారు. రేషన్ డీలర్లను ఎలా వినియోగించుకోవాలనే అంశంపై త్వరలో సమావేశం పెడదామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ విధానంలో సమూల మార్పులకు నిర్ణయం తీసుకున్నారు. పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమన్వయం ద్వారా అందుబాటులో నిత్యావసర వస్తువులు ఉంచాలని మంత్రులతో పాటు అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. 2019 ముందు వరకు సివిల్ సప్లైస్ శాఖ అప్పులు రూ.21,622 కోట్లు కాగా.. ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం ఆ అప్పులను రూ. 41550 కోట్లకు తీసుకువెళ్లిందని ముఖ్యమంత్రి అన్నారు. రేషన్ షాపుల ద్వారా అనేక రకాల సరుకులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# రఘురామకృష్ణరాజుకు తెలంగాణ హైకోర్టులో ఊరట

**ఇండ్-భారత్ పవర్ జెన్‌కాం లిమిటెడ్ దివాలా ప్రక్రియ కేసు**

**రఘురామకృష్ణరాజు ఖాతాను మోసపూరిత ఖాతాగా ప్రకటిస్తూ ఎస్‌బీఐ ప్రొసీడింగ్స్**

**వాటిని నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**




ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 02:

తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఇండ్-భారత్ పవర్ జెన్‌కాం లిమిటెడ్ దివాలా ప్రక్రియకు సంబంధించి ఆయన బ్యాంకు ఖాతాను మోసపూరిత ఖాతాగా ఎస్‌బీఐ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ ప్రొసీడింగ్స్‌ను నిలిపివేయాలంటూ రఘురామకృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించారు. నిన్న ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఎస్‌బీఐ జారీ చేసిన ప్రొసీడింగ్స్ అమలు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు.ఈ కేసులో ప్రతివాదులైన రిజర్వు బ్యాంక్, ఎస్‌బీఐలకు నోటీసులు జారీచేశారు. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు. అలాగే, ఇండ్-భారత్ పవర్ జెన్‌కాం లిమిటెడ్ డైరెక్టర్ కె.సీతారామం ఖాతాను కూడా మే 28న ఇలాగే మోసపూరిత ఖాతాగా ప్రకటిస్తూ ఎస్‌బీఐ ప్రొసీడింగ్స్ జారీచేసింది. తాజాగా, ఆయనకు కూడా ఊరట కల్పిస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 3 ఆగస్టు 2024

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించండి

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్ట్ 02:
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు.
శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, డిఆర్ఓ ఏ పద్మజ, ఇన్చార్జి డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శారదబాయిలతో కలిసి తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని దీంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎలాంటి అంటువ్యాధులు సంభవించకుండా ఉంటాయన్నారు. తల్లిపాల



ప్రాముఖ్యతను ప్రతి తల్లికి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. తల్లిపాలలో ముఖ్యమైన పోషకాలు లభిస్తాయని, బిడ్డను అనేక రోగాల నుండి సురక్షితంగా ఉంచుతాయని ఆమె తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డల మధ్య బంధాన్ని పెంపొందిస్తాయన్నారు. ఆరు నెలలు పైబడిన శిశువులకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారాన్ని కూడా అందించాలన్నారు. నవజాత శిశువు మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో తోడ్పడుతాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్వైజర్లు, అంగన్వాడి సిబ్బంది తదితర క్షేత్రస్థాయి సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యతను ప్రసవించిన తల్లులకు అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు.
ఇన్చార్జి డిఎంహెచ్ఓ డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారమన్నారు. తల్లిపాలు ఇచ్చే వారిలో రొమ్ము, గర్భాశయము మరియు అండాశయ క్యాన్సర్ ప్రమాదం తక్కువగా ఉంటుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి, డాక్టర్లు శ్రీజ, తేజస్విని, శ్రీదేవి, డెమో రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ మొత్తంతో పరారైన ఉద్యోగి సస్పెన్షన్, అరెస్ట్

**-జిల్లా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్ట్ 02:
పింఛన్ సొమ్ముతో పరారైన వెంగళంపల్లి సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ పవన్ కుమార్ ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ప్యాపిలి మండలం వెంగళంపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పథకం కింద 50 మంది పెన్షన్ దారులకు పంపిణీ చేయవలసిన మొత్తం రు. 2,23,500 లతో పరారైన సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ పవన్ కుమార్ ను సస్పెండ్ చేయడంతో పాటు అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. సంబంధిత మొత్తాన్ని తల్లితండ్రులను పిలిపించి వసూళ్లు చేయడం జరిగిందన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు రిమాండ్ కు పంపడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయ్యుండి బాధ్యతారహితంగా ప్రవర్తించడం సమంజసం కాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తీవ్ర కట్టిన చర్యలు తీసుకుంటామని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# హృతవిధీ.. నలుగురిని మింగేసిన సొంత గూడు

# నిద్రలోనే సమాధి

**-నంద్యాల జిల్లాలో చిన్న వంగలి లో ఘోర ప్రమాదం**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 02:**

నంద్యాల జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఇంటి మిద్దె ఒకే కుటుంబంలో నలుగురిని మింగేసింది. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరు అయ్యారు. ఈ ఘోర విషాద సంఘటన నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్న వంగలి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇటీవలి భారీగా కురిసిన వర్షాల వల్ల ఇంటి మట్టి మిద్దె బాగా నానిపోయి ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందారు. దీంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువుల కన్నీరు మున్నీరుతో ఆ గ్రామంలో రోదనలు మిన్నంటాయి. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్న వంగలి



గ్రామంలో భార్య భర్తలు గురుశేఖర్ రెడ్డి (45), దస్తగిరమ్మ (38), ఇద్దరు కుమార్తెలు పవిత్ర (16), ప్రసన్న (13), గురులక్ష్మి (10) ఉంది. ఇందులో రెండో కుమార్తె ప్రసన్న కడప జిల్లా ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో చదువుతోంది. మిగిలిన ఇద్దరు కుమార్తెలు ఇంటి వద్దే చదువుతున్నారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు నలుగురు ఇంట్లో నిద్రించారు. ఇటీవలి భారీ వర్షాలతో ఇంటి మట్టి మిద్దె బాగా తడిసి నానింది. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒక్కసారిగా ఇంటి మట్టి మిద్దె కూలిపోయింది. అర్ధరాత్రి కావడంతో ఇరుగు పొరుగు జనం చూడలేదు. శుక్రవారం తెల్లవారు జామున కూలిన మట్టిమిద్దెను గమనించిన స్థానికులు వెంటనే శిథిలాలను తొలగించారు. అప్పటికే గ్రామంలో అందరికి ఈ ఘటన సమాచారం అందింది. దీంతో అందరూ అక్కడికి చేరుకున్నారు. గ్రామ ప్రజలు అక్కడ గుమిగూడారు.
కూలిన మట్టి మిద్దె శిథిలాల కింద మృత దేహాలను చూసి చిన్న వంగలి జనం కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాలను చూసిన గ్రామ ప్రజలు అల్లాడిపోయారు. ఒకే కుటుంబంలో నలుగురు ఒక్కసారిగా మరణించడతో ఆ గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యులు రోదనలతో గ్రామమంతా మూగబోయింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చాగలమర్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ప్రజలు జిల్లా ఎస్పీ కి నేరుగా ఫిర్యాదు చేయాలి, లేదా మాట్లాడాలి అనుకున్న 9154987020 కు కాల్ చేయండి.

**-జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 02:
జిల్లా ప్రజలు సెంట్రల్ కంప్లైంట్ సెల్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు సంబంధించిన ఫిర్యాదుల గురించి సమాచారం తెలుసుకోవడానికి, శాంతిభద్రతలకు సంబంధించిన విషయాల కొరకు మరియు నంద్యాల జిల్లా ఎస్పీని సంప్రదించాలి లేదా మాట్లాడాలి అనుకున్న ఫిర్యాదుదారులు 9154987020 నెంబర్ కు ఫోన్ చేయవచ్చు మరియు మీ యొక్క సమస్యలకు సంబంధించిన సమాచారం తెలియజేయవచ్చును.ఆన్లైన్ మోసాలకు సంబంధించి, జాబ్ ఇప్పిస్తామని మోసం చేసిన, బిట్ కాయిన్స్ సంబంధించి, లోన్ యాప్లలో మోసపోయిన, మరి ఏ ఇతర సైబర్ మోసాలకు గురైన వారు మొదటగా 1930 నెంబర్ కు లేదా సైబర్ క్రైం ప్రభుత్వ వెబ్సైట్లో గాని, జిల్లా సైబర్ క్రైమ్ ఆఫీస్ ను గాని సంప్రదించవచ్చునని జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**-జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**




నంద్యాల జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తు వారి యొక్క సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం పోలీసుల సమస్యల పరిష్కారం కొరకు పోలీస్ వెల్ఫేర్ డే" (గ్రీవియన్స్ డే) ను నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా నేడు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు మరియు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది వారి యొక్క సమస్యల గురించి అనగా ట్రాన్స్ఫర్స్, రిక్వెస్టు, మెడికల్ సమస్యలు, సపెన్షన్ నుండి విధులకు మొదలగు సమస్యలను జిల్లా ఎస్పీ కి స్వయంగా విన్నవించుకున్నారు.జిల్లా ఎస్పీ వారి సమస్యలను తెలుసుకొని మీ సమస్యలకు తగిన పరిష్కారం చూపుతానని సంభందిత అధికారులకు ఆదేశాలిచ్చి సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తానని భరోసా కల్పించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి జె వి సంతోష్ , ఇన్స్పెక్టర్లు జయరాములు ,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# చిన్న వంగలి సంఘటన చాలా బాధకరం..

**ఎంపీ బైరెడ్డి శబరి.**

**-మృతులకు సంతాపం తెలిపిన ఎంపి డా. బైరెడ్డి శబరి**
**-ప్రసన్న భాద్యత నాది నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 02:
నంద్యాల జిల్లా చాగల్లమర్రి మండలం చినవంగలిలో తీవ్ర విషాదం చోటు చేసుకుందని, ఈ విషాద సంఘటన అందరిని కలిసివేస్తోందని, ప్రసన్న చదువు బాధ్యత పూర్తిగా తాను తీసుకొని ఆ బాధిత కుటుంబానికి అండగా ఉంటానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డా. బైరెడ్డి శబరి తెలిపారు. శుక్రవారం ఎంపి శబరి మాట్లాడుతూ చాగలమర్రి మండలం చినవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడడం చాలా బాధేస్తోందని అన్నారు.చినవంగలి గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి (45), దస్తగిరమ్మ (38) దంపతులు ఉండగా, వారి ఇద్దరు కుమార్తెలైన పవిత్ర (16), గురులక్ష్మి(10)లు ఉన్నట్లు సమాచారం అందిందన్నారు.కుటుంబంలో మొత్తం ఐదుగురు సభ్యులు ఉండగా, రెండో కుమార్తె ప్రసన్న కడప జిల్లా ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో చదువుతున్నట్లు సమాచారం ఉందని ఈ తీవ్ర విషాద ఘటన గురువారం అర్ధరాత్రి సమయంలో జరిగినట్లు తెలుస్తోందని, శుక్రవారం తెల్లవారుజామున ఈ విషయాన్ని గమనించిన స్థానికులు శిథిలాలను తొలగించి చూడగా అప్పటికే నలుగురు మృతిచెందడం, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం కలిసివేస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందించేందుకు కృషి చేస్తూ 10 వ తరగతి చదువుతున్న ప్రసన్న ఉన్నత చదువుల పూర్తి బాధ్యత తాను తీసుకుంటానని ఎంపి శబరి తెలిపారు.

# కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పెన్షన్ అందజేసిన టిడిపి నేతలు.



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల ఆగస్టు 02: మండల పరిధిలోని కామినేని పల్లె గ్రామంలో గల ఎస్సీ కాలనీలో నివసిస్తున్న మాముద్దు రాజు బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను కామినేని పల్లె గ్రామ టిడిపి నాయకులు కర్నూలు వెళ్లి పెన్షన్ అందజేయడం జరిగింది.
పెన్షన్ దారునికి ఉన్న అనారోగ్య సమస్యను స్థానిక ఎంపీడీవో కి వివరించి సచివాలయ సిబ్బంది ద్వారా కర్నూలు వెళ్లి లబ్ధిదారుని భార్యకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందజేయడం జరిగిందని కామినేనిపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సిరిగిరి రాంభూపాల్ రెడ్డి తెలియజేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల వల్ల పేద బడుగు బలహీన వర్గాల్లో ఆర్థిక భరోసా కల్పిస్తున్నద ని వారికి వైద్య చికిత్స కు టాబ్లెట్లకు కొద్దిపాటి పోషణకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సహాయపడుతున్నదని మాజీ వైస్ ప్రెసిడెంట్ బ్రదర్ అనిల్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరిగిరి పావన వెంకటరెడ్డి సిరిగిరి మా రెడ్డి లక్క ఆనంద రావు హుంగ ఓబులేష్ డీలర్ చలమయ్య ఇతర టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ 1లక్ష116 విరాళం.



ఆంధ్ర ప్రగతి రుద్రవరం ఆగస్టు 02:రుద్రవరం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలిసినశ్రీ దో ర్వి చెంచులక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి దాతలు రూ 1లక్ష 116 విరాళం అందజేశారు. దేవాలయంజీర్ణోదరణ సేవ కొరకు రుద్రవరం గ్రామానికి చెందిన అన్నదాత ఓబులయ్య బ్రదర్స్ ఆలయ అభివృద్ధి కోసం విరాళం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దొర్వి నరసింహస్వామి వారి సేవకులు వృద్ధి రెడ్డినరసింహ, పోల దాసు పెద్ద లక్ష్మీ నరసయ్య, వరద దస్తగిరి ,గంధీబండల శీను మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన దొర్వి చెంచు లక్ష్మి నరసింహస్వామి ఆలయం కొన్ని వందల సంవత్సరాల క్రితం రాజులు నిర్మించారన్నారు. ఈ గుడికి ఎంతో మహత్యం ఉందన్నారు. ఇక్కడ నిత్యం నీటి గుండాలలో నీరు సమృద్ధిగా ఉంటుందన్నారు. ఈ గుడి నల్లమల అడవి ప్రాంత సమీపాన ఉండడంతో ఎంతో ఆకర్షణయంగా ఉందన్నారు. ఈ గుడిని మరింత అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# 30 సంవత్సరాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

## -మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ.

**ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 02:**

**మూడు దశాబ్దాల తర్వాత మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పిఎస్) తన లక్ష్యాన్ని సాధించింది. జనాభా దామాషాలో ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలనే డిమాండ్తో 1994 నుంచి ప్రారంభమైన ఉద్యమం సఫలమైంది.సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఎంఆర్పిఎస్ సాగిస్తున్న పోరాటానికి ఫలితం లభించింది. "సుదీర్ఘంగా సాగిన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన ఎంఆర్పీఎస్ కార్యకర్తలకు ఈ విజయం అంకితం ఇస్తున్నా" అని సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ దగ్గద స్వరంతో అన్నారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో మాజీ రాడికల్ నేత మంద కృష్ణమాదిగ "తన జాతి ప్రయోజనాల కోసం" అంటూ బీజేపీకి మద్దతు ప్రకటించి, ప్రధాని నరేంద్రమోదీకి మద్దతు ప్రకటించి విమర్శలకు గురయ్యారు. తన లక్ష్యం ముందు ఇది పెద్దది కాదనే విధంగా సాగిన ఆయన సుదీర్ఘపోరాటం ద్వారా ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగలకు విద్య, ఉద్యాగాల్లో వాటి సాధించడం ద్వారా సఫలం అయ్యారు.**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థించిన ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం. మూడు దశాబ్దాల తర్వాత ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఫలించింది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సారధ్యంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పోరాటం ఊపిరిపోసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనీ యువ విద్యావంతులైన మాదిగ నాయకులు కీలక పాత్ర పోషించారు.

1994లో ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా జులై 7 న ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో (ఎంఆర్ఎస్ ఏర్పడింది. రాడికల్ గా పూర్వజీవితం గడిపిన మంద కృష్ణ మాది అధ్యక్షుడిగా, వామపక్ష ఉద్యమాలతో సంబంధం ఉన్న కృపాకర్ మాదిగ కార్యదర్శిగా వ్యవహరించారు. జనాభా దామాషాలో ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలనే ఉద్యమం 1994 నుంచి సాగుతోంది. ఈ ఉద్యమంలో 23 మంది కార్యకర్తలు ప్రాణాలు వదిలారు. ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న 23,560 మందిపై పోలీసు కేసులు నమోదయ్యాయి. వారిలో చాలామంది ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు."సంవత్సరాలుగా డిమాండ్ ఉన్నా, ఒకేసారి ఉద్యమరూపం దాల్చడం వంటివి దీనికి అనుకూలత అయ్యాయి" అని మానవహక్కుల ఉద్యమకారుడు కే.బాలగోపాల్ అభివర్ణించారు. "సరళంగా వివరించగల ఉద్యమ లక్ష్యాన్ని ప్రజలకు చేరవేయడంలో సంక్లిష్టమైన పద్ధతులు పాటించడం కొంత ఇబ్బందికరమైంది" అని ఆయన భావించారు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఉద్యమకారులు పలు పార్టీల నాయకులను కలిసి వారికి దీన్ని గురించి వివరించారు. అలానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఈ డిమాండుకు అనుకూలంగా తీర్మానం జరిగింది. వీటి నేపథ్యంలో ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల నడుమ సామాజిక అసమానతలను విచారించేందుకు రామచంద్రరాజు కమిషన్ అన్న జ్యుడీషియల్ కమిషనన్ ను సెప్టెంబరు 10, 1996న ఏర్పాటుచేసింది. ఎస్సీ వర్గీకరణ డిమాండ్ కు అనుకూలంగా మే 1997లో రామచంద్రరాజు కమిషన్ తన నివేదికను సమర్పించింది. జూన్ 6, 1997న ప్రభుత్వం జీవో ద్వారా షెడ్యూల్డ్ కులాల కోటాను వర్గీకరించింది. ఈ వర్గీకరణలో భాగంగా ఎస్సీలనుఏ,బీ,సీ,డీగా వర్గీకరించారు. "ఎ" గ్రూపులో రెల్లి సహా 12 కులాలు ఉంటాయి. వీరికి ఒక శాతం రిజర్వేషన్, రోస్టర్ స్లాట్లలో ముందుగా అవకాశాన్ని ఇచ్చారు. బి- గ్రూపులో మాదిగ, సంబంధిత 18 కులాలు చేర్చారు. 'సీ- గ్రూపులో మాల కులస్తులతో పాటుగా మరో 24 కులాలను చేర్చారు, -డీ గ్రూపులో ఆదిఆంధ్ర వగైరా కులాలు ఉంటాయి.

### వ్యతిరేకించిన మాలమహానాడు

మాల మహానాడు ప్రభుత్వ జీవోను వ్యతిరేకిస్తూ హైకోర్టులో కేసు వేసింది. సెప్టెంబర్ 18, 1997న ఏపీ హైకోర్టు ఫుల్ బెంచ్ ఈ జీవో ప్రభుత్వ పరిధికి మించినదనీ, రాజ్యాంగ విరుద్ధమంటూ జీవోను నిలుపుదల చేస్తూ తీర్పునిచ్చింది. ప్రభుత్వం జీవో విషయంలో కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ను సంప్రదించకపోవడం, షెడ్యూల్డ్ కులాల్లో వెనుకబడ్డవి, అత్యంత వెనుకబడ్డవి చేర్చి విభజన చేశారనీ, షెడ్యూల్డ్ కులాల్లో మార్పుచేర్పులు చేయడానికి రాజ్యాంగ సవరణ అవసరం అని పలు కారణాలను ప్రస్తావించారు. హైకోర్టు తీర్పు అనంతరం మాల, మాదిగ వర్గాల మధ్య భౌతికదాడులు కూడా జరిగాయి.

1997 అక్టోబరు మొదటివారంలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ దాడులు



చోటుచేసుకున్నాయి. ఈ గొడవల్లో చింతలచెరువు గ్రామంలో ఒక యువకుడు మరణించగా, మిగతా చోట్ల చెప్పుకోతగిన స్థాయిలో ఘర్షణలు చెలరేగాయి. 2004 వరకు ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టు తీర్పు తర్వాత.."మాదిగలు అనేక అవకాశాలు కోల్పోయారు. మేము ఎస్సీ రిజర్వేషన్ కోటా ఇంకా పెంచాలనడం లేదు. మాదిగలకు ప్రత్యేక హోదా అడగలేదు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు కోటాలో తమ జనాభాకు తగిన కోట ఇవ్వాలని మాత్రమే కోరుతున్నాం" అని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ చాలాసార్లు స్పష్టం చేశారు.30 ఏళ్ల పాటు సాగిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కే కాకుండా పరుగున ఉన్న కర్ణాటక తమిళనాడు మహారాష్ట్ర కూడా విస్తరించింది. ఆయా రాష్ట్రాల్లోని మాదిగ ప్రజలను చైతన్యం చేయడంలో మందకృష్ణ మాదిగ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అంతేకాకుండా జాతీయ రాష్ట్రస్థాయి అధికార ప్రతిపక్ష పార్టీలు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు మద్దతు పలికే విధంగా ఆయన తన చాతుర్యాన్ని ప్రదర్శించారు. ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ అంశాన్ని ఏపీ అసెంబ్లీలో మూడుసార్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. తర్వాత కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లో పడడం, కోర్టుల వరకు వెళ్ల దంతో ఆలస్యం జరిగింది.రిజర్వేషన్ వర్గీకరణ పోరాటంలో రాజకీయ పార్టీలకు అస్త్రంగా మారింది. మాల, మాదిగల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగింది. ఈ పోరాటంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తన లక్ష్యాన్ని సాధించగలిగారు. 1994 ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా నాగులపాడు మండలం ఈదుముడి గ్రామంలో 13 మంది మాదిగ యువకులతో స్థాపించబడింది మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ పోరాటానికి నాయకత్వం వహించారు. షెడ్యూల్ కులాల జాబితాలో చర్చ వారందరికీ సమానంగా రిజర్వేషన్ల ఫలాలు అందించడానికి మాదిగల విముక్తి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సిద్ధాంతంతో ఆవిర్భవించింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తమ ప్రయత్నాలను దండోరా ఉద్యమంగా ప్రకటించారు. ఈ ఉద్యమం గ్రామీణ మాదిగవాడల్లోకి చొచ్చుకుపోయింది. దండోరా ర్యాలీలు సమావేశాలతో మద్దతును సమీకరించారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మొదటి సమావేశం1995 మే 31న ఒంగోలులో జరిగింది ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి టీ.ఎం సదాలక్ష్మి తో పాటు 70 వేల మంది కార్యకర్తలు హాజరయ్యారు. అక్టోబర్ 25న నెల్లూరులో 35 వేల మందితో నిర్వహించిన బహిరంగ సభ వర్గీకరణ ఉద్యమం ఊపందుకుంది. నవంబర్ 25న విజయవాడ, 1996 జనవరి 8న కర్నూల్ లో వేలాదిమంది మాదిగల తోపాటు సామాజిక ఉద్యమం పోరాటాన్ని మార్పు చేస్తుంది. ఉద్యమాన్ని విస్తృతం చేయడానికి మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్, మాదిగ యువసేన, మాదిగ మహిళ సమాఖ్య వంటి విభాగాలతో శక్తివంతమైన సంస్థగా తీర్చిదిద్దడానికి మందకృష్ణ గెరిల్లా యుద్ధతంత్రాన్ని అమలు చేశారు.1996 ఫిబ్రవరి 3వ తేదీ హైదరాబాదులోని నిజాం కళాశాల మైదానంలో మందకృష్ణ మాదిగ సారధ్యంలో ఎమ్మార్పీఎస్ దాదాపు ఐదు లక్షల మంది మాదిగలతో తొలి రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ బహిరంగ సభ దండోరా ఎస్సీలను ఏబిసిడి గ్రూపులుగా విభజించడానికి అనుకూలంగా ప్రజాభిప్రాయానికి బలం లభించింది. అన్ని పార్టీల్లోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన మేధావులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఈసభ గ్రాండ్ సక్సెస్ కావడంతో మాదిగల ఉద్యమం మరో రూపు సంతరించుకుంది.

1996 మార్చి 25న మాదిగల ఆత్మగౌరవ ప్రదర్శన హైదరాబాద్లోని నిజాం కళాశాల బాబు జగ్జీవన్ వద్ద 80చ వేల మందితో బహిరంగ సభ నిర్వహించారు.¬ సమావేశానికి సీఎం ఎన్. చంద్రబాబు నాయుడు మాదిగ మంత్రులు హాజరయ్యారు ఎస్సీ రిజర్వేషన్



అమలులో అన్యాయం జరగకుండా రిజర్వేషన్ వర్గీకరిస్తామని సీఎం హామీ ఇచ్చారు.1996 సెప్టెంబర్ రెండో తేదీ హైదరాబాద్ లోని బషీర్ బాగ్ జగ్జీవన్ విగ్రహం నుంచి ఇందిరాపార్కు వరకు జరిగిన ర్యాలీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రెండు లక్షల మందికి పైగా మాదిగలు పాల్గొన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, సాయంత్రం వరకు బైఠాయించారు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో అధికార టీడీపీ మాదిగ ఎమ్మెల్యేలు మందా జగన్నాథం, రాజయ్య, సుదర్శన్ బృందాన్ని ప్రభుత్వం పంపించింది. మాదిగలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు ప్రజలకు హామీ ఇచ్చారు.ఎమ్మార్పీఎస్ డిమాండ్ పై విచారణకు ఏర్పాటు చేసిన కమిషన్ పై ఆరోజు ఉదయాన్నే శాసనసభలో సీఎం చేసిన ప్రకటనను వారు కూడా ప్రస్తావించారు. ఎంఆర్పీఎస్ కార్యకర్తలకు నమ్మకం కలగలేదు. ప్రతినిధులను వేదిక నుంచి బయటకు వెళ్ళమని బలవంతం చేశారు. దీంతో సీఎం ఎన్. చంద్రబాబు నివాసం నుంచి రాత్రి 10 గంటల సమయంలో మాదిగ నేతలకు ఫోన్ వచ్చింది. సీఎం కలిసిన ఎంఆర్పిఎస్ నేతలకు 45 రోజుల్లోగా విచారణ జరిపి వర్గీకరణ చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు కమిషన్ కూడా ఏర్పాటు చేసింది. మాల, మాదిగ ఉపకలాల రిజర్వేషన్ల వల్ల కలిగే ప్రయోజనాలను పరిశీలించేందుకు జస్టిస్ పీ. రామచంద్రరావు కమిషన్ నియమించి, వర్గీకరణకు సిఫారసు చేయాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడంలో దండోరా ఉద్యమం విజయవంతమైంది.

1997 ఏప్రిల్ 14వ తేదీ సీఎం ఎన్ చంద్రబాబు నాయుడు స్వగ్రామం నారావారిపల్లె నుంచి హైదరాబాద్ వరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సారథ్యం లాంగ్ మార్చ్ నిర్వహించారు.ఇదిలాసాగుతుండగానే , ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సవాల్ చేస్తూ, మాలమహానాడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సాంకేతిక కారణాలను చూపిస్తూ, వర్గీకరణ జీవోను సస్పెండ్ చేసింది.1998 అక్టోబర్ ఒకటో తేదీ ప్రభుత్వం వర్గీకరణ పై ఆర్డినెన్స్ ఇవ్వాలని నిర్ణయించింది. మంత్రివర్గం కూడా అంగీకరించింది. దానిని ఏపీ గవర్నర్ (సీ. రంగరాజన్)కు పంపించారు. ఆయన రాష్ట్రపతి (కె.ఆర్ నారాయణ) కు పంపించారు.1999 నవంబర్ 30వ తేదీ భారత రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేశారు. దాని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం 2000 ఏప్రిల్ ఒకటో తేదీ జీవో జారీ చేసింది.ఈ జీవోకు వ్యతిరేకంగా మాల మహానాడు సుప్రీంకోర్టు పిటిషన్ దాఖలు చేసింది. అన్ని చర్చలు పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రానికి లేదు పార్లమెంట్కు మాత్రమే ఉందంటూ ఆ జీవోను కొట్టివేసింది.దీంతో సుప్రీంకోర్టు తర్వాత అన్ని జాతీయ ప్రాంతీయ పార్టీలు పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశాయి ఆందోళనలో భాగంగా ఎమ్మార్పీఎస్ మళ్లీ విభిన్న కార్యక్రమాలను ప్రకటించింది.2004 నవంబర్ 16వ తేదీ అప్పటి సీఎం వైఎస్. రాజశేఖరరెడ్డి స్వగ్రామమైన పులివెందుల నియోజకవర్గం బలపనూరు నుంచి చైతన్య యాత్ర ప్రారంభించింది. ఆ సమయంలో వైఎస్ఆర్ తల్లి జయమ్మకు వినతిపత్రం అందించారు. ఆ తరువాత డిసెంబర్ 10వ తేదీ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ పై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోవడంతో..2005 ఏప్రిల్ 18వ తేదీ 55 రోజుల పాటు మాదిగల ధర్మయుద్ధ మహా పాదయాత్ర బెంగళూరు నుంచి హైదరాబాదుకు నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది మాదిగ ప్రజలు పాల్గొన్నారు. వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అఖిలపక్షం ఢిల్లీకి వెళ్లే తేదీని ప్రకటించాలని ప్రభుత్వానికి 12 గంటల సమయం ఇచ్చారు. నిజాం కాలేజీ మైదానంలో కార్యకర్తలతో మందకృష్ణ బైఠాయించారు. ఎట్టకేలకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి పంపేపందుకు సీఎం వైఎస్ఆర్ అంగించికరించక తప్పలేదు.2006 ఏప్రిల్ 5వ తేదీ మాదిగల తిరుగుబాటు మహా పాదయాత్ర 45 రోజులపాటు నిర్వహించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్లో ఎస్సీ వర్గీకరణ కోసం 2006 సెప్టెంబర్ 7వ తేదీ కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. కమిషన్ చైర్మన్ కొంతకాలం తర్వాత ఆ ప్రతిపాదన తిరస్కరించారు.

దీంతో,2007 ఏప్రిల్ 17వ తేదీ విజయవాడ సింగ్ నగర్ స్టేడియంలో 15 లక్షలతో విశ్వరూప



మహాసభ నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్ఆర్ హాజరయ్యారు. కేంద్రం నియమించిన కమిషన్ సారధ్యం తీసుకునేందుకు జస్టిస్ దురైస్వామి, జస్టిస్ మదన్మోహన్ ముందుకు రాలేదు. దీంతో మంద కృష్ణమాదిగ సికింద్రాబాద్ సీతాఫల్ మండీ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఎంఆర్పిఎస్ కార్యకర్తలు హింసాత్మక చర్యలకు దిగారు. గత్యంతరం లేని స్థితిలో సీఎం వైఎస్ఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి, కమిషన్ చైర్మన్ నియామకానికి చర్యలు తీసుకున్నారు.

2007 జూన్ 11వ తేదీ అనంతపురం నుంచి బైక్ ర్యాలీ తో జైత్రయాత్ర నిర్వహించారు రాష్ట్రంలో దాదాపు 1950 కిలోమీటర్ల మేరయాత్ర సాగింది అనంతరం జూలై 25వ తేదీ ర్యాలీ హైదరాబాద్ చేరింది ఇందిరాపార్క్ వద్దకు చేరిన వారంతా అసెంబ్లీ ముట్టడికి ప్లాన్ చేశారు దీంతో వీరిని సీఎం కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది చర్చల అనంతరం ధర్నాను ముగిసించారు

2008 ఏప్రిల్ 25వ తేదీ జస్టిస్ ఉషా మహిళా కమిషన్ ఏపీలో పర్యటించి, షెడ్యూల్ కులాల గ్రామాలను సందర్శించి, నివేదిక సిద్ధం చేసినా, సమర్పించడంలో జాప్యం జరిగింది. దీంతో ఏప్రిల్ 4వ తేదీ సికింద్రాబాద్ వద్ద మందకృష్ణ మాదిగ ఇతర నాయకులతో ఆమరణదీక్ష ప్రారంభించారు. 2008 మే ఒకటో తేదీ జస్టిస్ ఉషామెహ్రా కమిటీ తన నివేదికను సమర్పించడంతో ఎంఆర్పిఎస్ నాయకులు ఆమరణ దీక్ష విరమించారు.

2008 డిసెంబర్ 14వ తేదీ ముషీరాబాద్ వద్ద పాస్ అంటూ డెత్ ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్ లో ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రారంభించారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెడితేనే నిరాహార దీక్ష విరమిస్తానని కృష్ణ మాదిగ పట్టుబట్టారు. ఎనిమిది రోజుల తర్వాత ఆయనను పోలీసులు అరెస్టు చేశారు.

2009 ఫిబ్రవరి 16వ తేదీ జస్టిస్ ఉష మహిళా కమిషన్ నివేదిక వర్గీకరణకు సానుకూలంగా సమర్పించారు. దీంతో ఆ తర్వాత చర్యలు తీసుకోలేదు. దీనిని నిరసిస్తూ రాజమండ్రి వేదికగా విశ్వరూప మహాసభ కార్యక్రమాన్ని మందకృష్ణ మాదిగ చేపట్టారు.2009 ఫిబ్రవరి 4వ తేదీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యులు అసెంబ్లీ పైభాగానికి చేరి ఆత్మహత్యకు సిద్ధంగా ఉన్నామంటూ హెచ్చరికలు జారీ చేశారు ఎంతో వందలాది మందిపై కేసులు నమోదు చేశారు.2009 మార్చి రెండో తేదీ గాంధీభవన్ ముట్టడించారు ఎంఆర్పిఎస్ ఉద్యమంలో భాగంగా మొత్తం 23 మంది సభ్యులు ప్రమాదాలలో మరణించారు. ముఖ్యంగా గాంధీభవన్ ముట్టడిలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నలుగురు అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురు చనిపోయారు.

2010 హైదరాబాదులోని నిజాం కళాశాలలో జరిగిన యుద్ధభేరి కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి లక్షణాదిమంది మాదిగ ప్రజలు







హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో సవరణ బిల్లును ప్రవేశ పెట్టాలని లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఆ మేరకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. రాత్రి 10 గంటలకు సీఎం ఇంటివైపు ర్యాలీని ప్రారంభించారు. దీంతో ఎంఆర్పిఎస్ నాయకులను అడ్డుకున్నారు. రెండు గంటలకు వారిని విడుదల చేశారు. వర్గీకరణ పై రాజ్యాంగ సవరణకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆమరణ దీక్ష చేపట్టారు సీఎం కిరణ్ కుమార్ రెడ్డి హామీ మేరకు దీక్ష విరమించారు.ప్రతిసారీ ప్రభుత్వం నుంచి హామీలు రావడం, సమస్య పరిష్కరించకపోవడంతో ఎప్పటికప్పడు ఎంఆర్పిఎస్ ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఆలస్యం అయ్యే కొద్దీ విభిన్న కార్యక్రమాలతో మంద కృష్ణమాదిగ సాగించిన ఆందోళనల ద్వారా నిప్పు కణిక ఆరనివ్వకుండా రాజుకునేలా చేస్తూనే ఉన్నారు. సుప్రీం కోర్టులో కేసులు సాగుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఉద్యమాలకు విరామం ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయన సాగించిన పోరాటానికి ఫలితం దక్కింది. రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఎంఆర్పిఎస్ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.